

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ



**బోలెరే పపీహరా, పపీహరా**

**నిత్ ఘన్ బర్సే, నిత్ మన్ ప్యాసా**

**నితమన్ ప్యాసా, నిత్ మన్ తర్సే**

**'డ్రీం డెబ్యూ'** అని ఓ పదం ఉంది. ఏదైనా పనిలో తొలిసారి విజయం సాధించటాన్ని 'డ్రీం డెబ్యూ' అంటారు. అది క్రికెట్ ఆట కావచ్చు, సినిమా కావొచ్చు, పాట పాడటం కావచ్చు. ఏదైనా తొలిసారి ప్రదర్శన ఎంతో గొప్పగా ఉండి ఎంతో గుర్తింపును తెచ్చిపెడుతుంది. 'గుడ్డి' సినిమాలో, వసంత్ దేశాయ్ సంగీత దర్శకత్వంలో, 'గుల్జార్' రాసిన ఈపాట సినిమాల్లో వాణీ జయరామ్ పాడిన తొలిపాట. ఈ తొలి పాట సూపర్ 'హిట్' అయి, ఆమెకు ఎంతగా గుర్తింపు తెచ్చిందంటే, ఆమెతోపాటు ఇదే సినిమా నాయిక అయిన 'జయాభాదురి' కన్నా, 'గుడ్డి' అనగానే 'బోలెరే పపీహరా' గుర్తుకువస్తుంది. వాణీజయరాం గుర్తుకు వస్తుంది.

1970 దశకంలో హిందీ సినిమా స్వరూపం తీవ్రంగా రూపాంతరం చెందటం ఆరంభమయింది. పాత తరం నెమ్మదిగా తెరమరుగవుతూ కొత్త తరం సినిమాపై తమదైన ముద్ర వేసేందుకు సిద్ధమౌతోంది. సినిమాతోపాటు సినిమా సంగీతం కూడా మార్పు చెందుతున్న సమయం అది. హిందీ సినీ సంగీత స్వర్ణ యుగాన్ని స్థిరపరచి అలరించిన సంగీత దర్శకులు ఒకరొకరుగా తెరమరుగవుతున్న సమయం అది. కొత్త తరం సంగీత దర్శకులు పాత వారిని నెట్టివేసి ఆ స్థానాన్ని ఆక్రమించేందుకు ఉవ్విళ్ళూరుతున్న సమయం అది. ఆ సమయంలో వచ్చిన 'గుడ్డి', అర్ధవంతమైన ఆఫ్‌బీట్ సినిమాలకు, సంగీతానికి ఆరిపోయే ముందు వెలిగే 'దీపం'లాంటి సినిమా.

'గుడ్డి' సినిమాలోజయా భాదురి టీనేజ్ పిల్ల. ఆ వయసు పిల్లల్లాగే సినీనటుడు 'ధర్మేంద్ర'ను ప్రేమిస్తుంది. అదొక్కటి వదిలేస్తే మిగతా అంతా మంచి పిల్లే. ఆమె వదిన సోదరుడు ఆమెను వివాహం చేసుకోవాలనుకుంటాడు. ఆమె ధర్మేంద్రనే

వివాహం చేసుకుంటానంటుంది. నిజానికీ, కాల్పనిక ప్రపంచానికి తేడా తెలియని యువతి భ్రమను వదిలించి, నిజానిజాలు తెలియచెప్పటం సినిమా కథ. సినిమాలో ఓ సందర్భంలో నాయికా, నాయకులు వర్షంలో చిక్కుకుని గుహలో తల దాచుకుంటారు. ఆ సమయంలో వస్తుంది ఈ పాట.

'పపీహర' అన్నది పాటలు పాడే పక్షి. పలువురు ఈ పక్షిని కోకిలతో సమానమైన పక్షిలా వర్ణిస్తారు. ముఖ్యంగా వర్షాకాలంలో మధురమైన గీతాలు పాడుతుంది ఈ పక్షి. సినిమాలో నాయిక అమాయకురాలు. యవ్వనంలో కలిగే కోరికలకూ, ఊహలకూ, మధుర భావనలకూ అతీతురాలు కాదు. కానీ ఆ భావనలు, కోరికలు, ఊహల పట్ల స్పష్టమైన అవగాహనలు లేవు. సినిమా హీరో పట్ల 'పిచ్చి' ఉన్నా, అది తాత్కాలికమే. అందుకే ఆమె తనను ప్రేమిస్తున్న వాడి సాంగత్యానికి స్పందిస్తుంది. చక్కటి రొమాంటిక్ పాటను అందుకుంటుంది.

సినీ పాటలకు శాస్త్రీయ సంగీత ఆధారిత బాణీలను మాత్రమే రూపొందించే సంగీత దర్శకుడు వసంత్ దేశాయ్. ఆయన పరమాద్భుతమైన బాణీలను సృజించాడు. అతి రమణీయమైన గీతాలను రూపొందించాడు. 1970లలో పాటల స్వరూపం మారుతున్నా ఆ మార్పులకు అతీతంగా శాస్త్రీయ రాగ ఆధారిత గీతాన్ని రూపొందించాడు. ఈ పాట పాడాలంటే శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొంది ఉండాలి. అవలీలగా రాగాలు తీయగలగటమే కాదు అతి సులువుగా క్లిష్టమైన అలంకారాలు చేయగలిగి ఉండాలి. అప్పటికి సినీ ప్రపంచంలో అలాంటి ఏకైక గాయని లతా మంగేష్కర్. కానీ, కొత్త యువతి నాయికగా నటిస్తోంది కాబట్టి, ఆమెకు తగ్గ యువ స్వరాన్ని వాడాలని వసంత్ దేశాయ్ నిశ్చయించాడు. అదీగాక, నిజానికి లతా మంగేష్కర్ శాస్త్రీయ సంగీతంలో కఠిన శిక్షణ పొందలేదు. ఆమె తండ్రి ఆమెకు పదమూడేళ్ళున్నప్పుడు మరణించాడు. ఆమె శిక్షణ అంతవరకే. తరువాత ఆమె సంగీతం సినిమాపాటలు పాడుతూ నేర్చుకుంది. సాధన చేసింది. కానీ, ఒక విద్యార్థిలా దీర్ఘకాలం శిక్షణ పొందలేదు. అందుకే, లతా మంగేష్కర్ ఎంతగా ప్రయత్నించినా వసంత్ దేశాయ్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. శాస్త్రీయ సంగీతంలో శిక్షణపొందిన గాయనితోనే పాడించాలన్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నాడు. చివరికి వెతికి వెతికి కర్ణాటక సంగీతంలో శిక్షణ పొందిన వాణీ జయరాంను పాట పాడేందుకు ఎంచుకున్నాడు.

ఈ పాటను వసంత్ దేశాయ్ 'మియా కీ మల్హార్' రాగంలో రూపొందించారు. 'మల్హార్' రాగం వర్ష ఋతువు రాగం. అతి ప్రాచీన రాగం ఇది. సంగీత విద్వాంసులు ఈ రాగాన్ని కచేరీల్లో అధికంగా పాడతారు. 'మల్హార్' ను 'మియా కీ మల్హార్' లను సమానార్థకాలుగా మలచింది తాన్సేన్. మల్హార్, కణాద రాగాలను కలిపి 'మియా కీ మల్హార్' రాగాన్ని సృజించాడు తాన్సేన్. అప్పటినుంచీ ఈ రాగం ప్రాధాన్యం, ప్రాచుర్యాలు పెరిగిపోయాయి. ఈ రాగం ఆధారిత 'బందిష్',

'బోలెరే పపీహరా' ను రూపొందించింది నైమత్‌ఖాన్. మహమ్మద్ షాహ రంగీలా (క్రీశ 1719 -1740) ఆస్థానంలో సంగీత విద్వాంసుడు నైమత్‌ఖాన్. అప్పటి నుంచీ ఈ పాటను సంగీత విద్వాంసులు తమదైన ప్రత్యేకతలతో పాడుతూ అలరించారు. సంగీత ప్రపంచాన్ని ఉర్రూతలూపారు.

పండిత్ కుమార్ గంధర్వ్, పండిత్ డి.వి. పలుస్కర్, విదుషి అశ్విని భీడే దేశ్‌పాండే వంటి విద్వాంసులు 'బోలెరే పపీహరా' పాటను తమదైన ప్రత్యేకలతో ఆలపించారు. కుమార గంధర్వ 'పపైహరా' అని పాడతాడు. పలుస్కర్ పపీ దగ్గర అలంకారాలు వేసి 'హరా' అంటాడు అశ్వినీ భీడీ 'పపీ దగ్గర దీర్ఘం తీస్తూ గమకాలు వేసి హరా దగ్గరకు వస్తుంది. ఇలా ఒకో విద్వాంసుడు తనదైన ప్రత్యేకతలతో 'బోలెరే పపీహరా' పాటను విభిన్నమైన సుందరతరమైన అలంకారాలతో అత్యంత సుందరంగా గానం చేశారు. వారు పాడే పాటలో ఒకే చరణం ఉంటుంది.

**బోలెరే పపీహరా పపీ హరా**

**అబ్ ఘన్ గర్జే ఊ ఊకర్ ఆయీ బదరియా**

**బర్ సన్ లగే సదరంగలీ**

**మొహమ్మద్ షాహ దామినీసీ కౌంద్ చౌంద్**

**మోరా జియరా లర్‌జీ**

'సదారంగీ' అన్నది నైమత్‌ఖాన్ కలం పేరు. ఈయన తన బంధువు 'అదారంగ్'తో కలసి ఈనాడు అందరూ ఆలపిస్తున్న 'ఖయాల్' గాయకీకి మార్గదర్శకులు.

కోకిల పాడుతోంది.

ఇపుడు మేఘాలు గర్జిస్తున్నాయి

గర్జన శబ్దాలు చేస్తూ వస్తున్నాయి మేఘాలు

విభిన్న రంగుల వర్షం కురుస్తోంది, మొహమ్మద్ షాహ,

ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తోంది.

ఇదీ 'గుల్జార్' ఈ సినిమా కోసం రచించిన 'బోలెరె పపీహరా' పాటకు ప్రేరణ. ఈ పాట ప్రేరణతో ఇతర విద్వాంసులు రచించిన పాటలలో మెరుపులతో కురిసే వర్షాన్ని వర్ణించారు. 'గుల్జార్' కూడా వర్షాన్ని వర్షిస్తూనే 'రొమాంటిక్' భావనలను పొందుపరచాడు.

వాణీ జయరాం ఈ పాటను అత్యద్భుతంగా పాడింది. లతా పాటను పాడి ఉంటే ఇంకా అద్భుతంగా ఉండేదేమో! కానీ వాణీ జయరాం ఎంత అద్భుతంగా పాడిందంటే, ఈ పాటను ఆమెకాక మరెవరూ పాడటాన్ని ఊహించటం కుదరదు. ముఖ్యంగా పాటలో అత్యంత అమాయకంగా ధ్వనించే ఆమె స్వరం జయాభాదురికి సరిపోవటంతో పాటు, పాట పాడటంలో ఆమె వేసిన అలంకారాలను పరిశీలిస్తే వాణీ జయరామ్ స్వరం ఈ పాటకోసమే ఏర్పడిందనిపిస్తుంది. ఈ పాట వాణీజయరాం స్వరం కోసమే సృజించినట్టనిపిస్తుంది.

పాట బాణీని రూపొందించటంలో గొప్ప చమత్కారం చేశాడు వసంత్ దేశాయ్.

ఒక పాటను పాడటంలో ఎన్ని రకాల అలంకారాలను పొందుపరచవచ్చో అన్ని రకాల అలంకారాలను పొందు పరచాడు. పాటలో ఒక స్వరం నుంచి మరో స్వరానికి 'మీండ్' తీస్తూ వాణీజయరామ్ వెళ్లటం వర్షపు లయను తలపుకు తెస్తుంది. పలు సందర్భాలలో వాణీ జయరామ్ స్వరంలోని 'ఆందోళనలు' ఉండి ఉండి మెరుస్తూ, మెరుపుల నడుమ కనిపించే వర్షపు ధారను ధ్వనింపచేస్తాయి. 'ముర్కి'ల గురించి చెప్పనవసరంలేదు. వర్షపు చినుకు నేలపై పడి చిందే లయను తలపిస్తాయి. గమకాలు మైమరపిస్తాయి. స్థిరంగా కురిసే వర్షపు ధారలు గాలికి వంపులు తిరగటాన్ని అనుభవింప చేస్తాయి గమకాలు. అయితే, 'బోలెరే పపీహరా' పాటలో అన్ని అలంకారాలను మించి మైమరపించి, మురిపించే అలంకారం 'ఖట్కా'.

ఒకే స్వరాన్ని స్వర సమూహంగా ప్రదర్శించటాన్ని 'ఖట్కా' అంటారు. ఇందులో ప్రధాన స్వరం ప్రముఖంగా వినిపిస్తుంది. ఇతర స్వరాలు ప్రధాన స్వరంలో చేర్చి పలకటం 'ఖట్కా'. 'ఖట్కా 'లను అన్ని సమయాల్లో అన్ని స్వరాలమీద వాడకూడదు. సముచితంగా ధ్వనించే స్వరాల మీదనే వాడాలి. 'మియాకీ మల్హార్' రాగంలో 'ఖట్కా' అలంకారాన్ని అధికంగా వాడరు. కానీ విద్వాంసులు పాడి మెచ్చిన 'బందిష్' ను పాటగా మలుస్తున్నప్పుడు వాటికి భిన్నంగా ధ్వనిస్తూ, మరింత ఆకర్షణీయంగా ధ్వనింపచేసేందుకు వసంత్ దేశాయ్ పల్లవిలోనే 'ఖట్కా'ను అతి సుందరంగా వాడాడు. ముఖ్యంగా పల్లవి చివరలో వాడిన 'ఖట్కా'తో పాట మరింత ఆకర్షణీయం అవటమే కాదు, ఒక యువతి శాస్త్రీయ

రాగాధారిత 'బందిష్'ను పాడుతూ తన యవ్వనంలోని దూకుడును ప్రదర్శిస్తూ నియంత్రించుకున్న భావన కలిగి 'అద్భుతం' అనిపిస్తుంది.

'బోలెరే పపీహరా, పపీ హరా', అని పాడుతున్నప్పుడు, 'పపీహరా' అనటం దగ్గర స్వరాలు తొందరగా పరుగులిడుతూ ఒకదాన్నొకటి హత్తుకున్నట్టు అనిపిస్తుంది. దాంతో 'పపీహరా' అని అంటున్నప్పుడు, పక్షి 'కిచకిచ' మన్న భావన కలుగుతుంది. ఇది 'ఖట్కా' అలంకారంతోసాధ్యమయింది. పాటలో 'అలంకారం' ప్రత్యేకంగా వేసిన భావన కలగనీయకుండా, మంచినీరు ఎలా తనదారి వెతుక్కుంటూ ప్రయాణిస్తుందో, అలా మామూలుగా పాడుతూ 'ఖట్కా'తో స్వాభావికంగా పాటను అలంకరించినట్టు చేయటం అంత సులభం కాదు. దాని వెనుక ఎంతో పరిశ్రమ ఉంటుంది.

అలాగే, పల్లవి చివరలో 'నిత్ మన్ తర్సే' దగ్గర స్వరాలను దగ్గర లాగటం 'నిత్ మన్ తర్సే' అంటూ రాగం తీసి ముగింపులో 'తర్సే ఏఏ' అని హఠాత్తుగా ఆపినట్టు పాడటంలో 'ఖట్కా' సౌందర్యం తెలుస్తుంది. దాంతోపాటు 'అందం' పరిమళభరితం అవుతుంది. అద్భుతమైన బాణీ రూపకల్పనకు అంత సుందరమైన గాన సంవిధానం తోడయింది. అందుకే 'బోలెరే' అంటూ పాట ఎత్తుకోవటంతోటే నీరు నిండిన చల్లని గాలి శరీరాన్ని తాకినట్టయి మనసు ఆహ్లాదమయమౌతుంది. ఇక పాటలో లీనమై పాట రాగం వెంట మనస్సు ప్రవహిస్తుంది. పాట గతిలో లీనమైపోతుంది.

సాధారణంగా 'గుల్జార్' సంక్లిష్టమైన గీత రచన సంవిధానానికి పెట్టింది పేరు. ఆయన పాటను అర్థం చేసుకోవటం కఠినం. కానీ ఈ పాటను సరళమైన హిందీ పదాలతో, పరిశుభ్రమైన భావనలతో, వర్షంలో తడిసి ప్రకృతి స్వచ్ఛమైనట్టు, అతి స్వచ్ఛమైన గీతాన్ని రచించాడు.

'పపీహర పక్షి అంటోంది. లేక, పక్షి పాడుతోంది అనుకోవచ్చు. ఏమని పాడుతోందంటే, ఓ పక్క మేఘాలు కురుస్తూనే ఉన్నాయి. మరో పక్క మనస్సు దాహార్తితో ఉంది. ఓ పక్క మనస్సు దాహంతో తపిస్తోంది, మరో పక్క మనస్సు తపిస్తోందని, కోకిల పాడుతోంది' ఇదీ పల్లవి.

ఇక్కడ కోకిల పక్షిని, వర్షాకాలంలో ప్రియుడి కోసం తపించే యువతి హృదయంగా ప్రదర్శించాడు కవి. రూపకాలంకారాన్ని అతి సుందరంగా వాడేడు. కురుస్తున్న వర్షం, దాహంతో తపించే హృదయం వంటి భావనలతో అద్భుతంగా యువతి మనో సంఘర్షణను, ప్రేమ భావన సంపూర్ణంగా అవతగం కాకున్నా, ఆ భావనల వల్ల జనించిన తపనను అనుభవించే యువతి మనస్సును అతి సుందరంగా వర్ణించాడు.

**పల్కోం పర్ ఎక్ బూంద్ సజాయే**

**బైఠీ హూ సావన్ లే జాయే**

**జాయె పీకే దేస్ మె బర్సే**

చక్కటి కవిత ఇది.

కనురెప్పలను ఒక నీటి బిందువుతో అలంకరించి, వర్షం నన్ను వెంట తీసుకు వెళ్తుందని ఎదురు చూస్తున్నాను. ఈ వర్షం వెళ్ళి నా ప్రియుడి దేశంలో, అంటే ప్రియుడు ఉన్న చోట వర్షించాలని ప్రార్ధిస్తున్నాను.

పాట రాగం, భావం, గాయని స్వరం వింటూంటే అత్యద్భుతమైన శృంగారానందమయమైన అలలపై తేలియాడతాం. వర్షం పడుతోంది. కనురెప్పలను నీటి బిందువుతో అలంకరిస్తుందట. ఈ వర్షం తనని వెంట తీసుకు వెళ్లి ప్రియుడున్న చోట వర్షించాలని ప్రార్ధిస్తోంది. ఊహిస్తున్న కొద్దీ ఆనందంతో, అలవికాని మధురమైన భావనతో కన్నీరు చిప్పిల్లుతుంది. ప్రియుడు దూరంగా వుండటంవల్ల మనస్సులో కలిగే విరహ వేదనను బిందువులా మలిస్తే, ఆ బిందువును ఈ వర్షం తీసుకువెళ్ళి, ఆ ప్రియుడిపై వర్షిస్తూ, తన సందేశాన్ని అందించాలన్నమాట.

**కురియునా కన్నీరు గుండెలో దాచుకుని**

**వాన జల్లుగ కురిసిపోవా**

**కన్నీరు ఆనవాలుగ బావమ్రోలా!!!**

'కమ్మని భావమే కన్నీరై చిందెను' అంటే ఏమిటో అనుభూతికి వస్తుంది. 'వర్ష సందేశం' ఇది. తన కళ్ళు ప్రియుడి కోసం తపిస్తూ కురిపించే వర్షాన్ని, ఈ వర్షం తీసుకు వెళ్లి ప్రియుడున్న ఆ స్థలంలో వర్షించాలట. చిత్రీకరణలో కూడా జయాభాదురి ప్రియుడివైపు చూసి మనోహరంగా నవ్వుతుంది. ఆమె కళ్లు అమాయక ప్రేమలో ఉండే అసంపూర్ణ, సందిగ్ధ శృంగార భావనలను ప్రదర్శిస్తాయి.

**సావన్ జో సందేశాలాయే**

**మేరీ ఆంఖ్ సె మోతీ పాయే.**

**జాయే మిలే బాబుల్ కీ ఘర్ సే**

సందేశాన్ని తెచ్చిన వర్షానికి నా కంటిలో ముత్యం లభిస్తుంది.

కవి చాలా కవితాత్మకంగా చెప్తున్నాడు. మొదటి చరణంలో తన కంటిలో ఉన్న బిందువును మోసుకుని వెళ్ళి ప్రియుదున్న స్థలంలో వర్షించమంది. రెండో చరణంలో ప్రియుడినుంచి వర్షం తెచ్చిన సందేశం తన కంట్లో ముత్యాన్ని తెస్తుందంటోంది. ముత్యాన్ని తేవటం అంటే, వర్షం మోసుకొొచ్చిన సందేశం ఆమె కళ్లను చెమరింపచేస్తుందని, ఒక కన్నీటి చుక్కను ఉబికి వచ్చేట్టు చేస్తుందని అర్థం. అంటే, వర్షం ప్రియుడినుంచి సందేశాన్ని తెచ్చింది. అది ఆమెకు ఆనందంతో కన్నీటిని తెచ్చింది. ఆ కన్నీటి ముత్యం బహుమతిగా వర్షం పొందుతోంది. ఆనంద భాష్పాలన్నమాట. అంటే వాళ్ళిద్దరి సంగమం ఆమె పుట్టింట్లో సంభవిస్తోందన్నమాట. సందేశాలు కలిశాయి. అది ప్రతీక.

ఆమె పుట్టింట్లో ఉంది. అతడు ఉన్న చోటుకి వర్షంతో సందేశం పంపింది అక్కడ వర్షం కురిసింది. అతడికి ఈమె సమాచారాన్ని అందించింది. అతడి సందేశాన్ని మోసుకు వచ్చింది. అది అందుకోవటంతోటే ఆనందం సంతోషంతో ఆమె కంట ముత్యమయింది. ఆమెకు ప్రాణం వచ్చింది. ఇదంతా 'పపీహర' చెప్పింది. ఒకచోట ఒక మనసు తపిస్తోంది. మరో హృదయం దాహంతో తపిస్తోంది. ఈమె ఇక్కడ. అతనక్కడ. సందేశం ఇద్దరినీ కలిపింది.

పాట బాణీ, భావం, గానం అన్నీ సమపాళ్లలో కుదిరి పాట వినటాన్ని ఒక సంవేదనల జల్లుగా మార్చి హృదయాన్ని తడిపేస్తుంది. పాటవల్ల అనుభవానికి వస్తున్న మాధుర్యం, తీయని భావనలు కళ్లు చెమ్మగిల్లేట్టు చేస్తాయి.

ఉత్తమ కళాసృష్టికి అత్యుత్తమ నిదర్శనం ఈ పాట. నిజానికి అత్యుత్తమ కళాసృష్టి, వ్యక్తికి తనలో ఉన్నాయని తెలియని సున్నిత భావనలను తట్టిలేపుతుంది. అతని హృదయంలో ఉందని తెలియని భావనల గది తలుపు తెరుస్తుంది. వ్యక్తిని మారుస్తుంది. ఉత్తమ మానవుడిగా ఎదిగేట్టు చేస్తుంది. కానీ ఎప్పుడయితే, పాఠశాలల్లో 'భాష'ల ప్రాధాన్యం తగ్గిందో, భాషల్లో కూడా సంకుచిత భావనల పాఠాలు మొదలయ్యాయో, జీవితంలోంచి, సమాజంలోంచి సున్నిత భావనలు అదృశ్యమయ్యాయి. వెన్నెల చల్లదనం, స్పర్శ వెచ్చదనం, తపనలోని తీయదనం తెలియని తరాలు కళలాంటిదేదో సృజిస్తున్నాయి. మనుషుల్లో సున్నితత్వం అడుగంటింది. భ్రమల మాయాజాలాల్లోనే కృత్రిమ సౌఖ్యం

వెతుక్కుంటోంది ప్రపంచం.అదే అసలు కళ అనుకుంటోంది. అదే ఆనందం అనుకుంటోంది. వారికి నిజానిజాలు తెలియాలంటే ఇలాంటి పాటలను అనుభవించాలి.

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

Click here to share your comments on this story